క్లుప్తంగా

వందశాతం ఇంటిపన్ను వసూలు చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శశిప్రభ

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రతీ గ్రామంలో వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని ఎంపీడీఓ శశిప్రభ అన్నారు. బుధవారం ఆమె ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నర్సరీలకు మట్టి తెప్పించి, పాలిథిన్ కవర్లలో నింపాలన్నారు. ప్రతీ గ్రామంలో మౌలిక వసతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. అదేవిధంగా ఎన్నికలు దగ్గర పడుతున్నందున, ఎన్నికలు సక్రమంగా నిర్వహిందుకు సరైన ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రమేశ్, ఈసీ భగవాన్ పాల్గొన్నారు.

ఇంటింటికీ ఓటరు స్లిప్పులు అందజేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్ ముసాద్దీక్

చిలప్‌చెడ్(నర్సాపూర్): అర్హులైన ఓటర్లందరికీ ఇంటింటికి వెళ్లి ఓటరు స్లిప్పులు అందజేయాలని తహసీల్దార్ ముసాద్దీక్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రమైన చిలప్‌చెడ్‌లో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు స్లిప్పుల పంపిణీ ప్రారంభమైందని, ప్రతీ ఓటరుకు స్లిప్పు అందేలా బీఎల్‌ఓలు కృషి చేయాలన్నారు. అదే విధంగా ఈవీఎం, వీవీప్యాట్ మిషన్‌లపై అవగాహన కల్పించామన్నారు. ఈ నెల 19 తేదీ వరకు ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఓ వెంకటేశ్, ఆర్‌ఐ వెంకటేశ్వర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్ పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ బీవీఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేశారు. బుధవారం స్ట్రాంగ్ రూమ్‌ను నర్సాపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ శ్రీనివాసులు సందర్శించి, భద్రత ఏర్పాలను పరిశీలించారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య



సుమన్

పాపన్నపేట(మెదక్): కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని రామతీర్థం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ గాలయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎల్లమ్మ కిష్టయ్య దంపతులకు ముగ్గురు సంతానం. 12 ఏళ్ల క్రితం ఎల్లయ్య మృతి చెందాడు. కిష్టమ్మ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తూ ఉండగా పెద్దకుమారుడు సుమన్(21) కూలీ పనులు చేసుకుంటూ తల్లికి సాయం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆమె మంగళవారం మహిళా సంఘంలో రుణం డబ్బులు తీసుకుంది. ఈ విషయంలో సుమన్ తల్లితో గొడవపడగా, భయపడిన కిష్టమ్మ తన చెల్లి ఇంటికి నార్సింగి వెళ్లింది. ఇంట్లోనే ఉన్న సుమన్ ఉరి వేసుకొని మృతి చెందగా, గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. కిష్టమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

సోలార్ లైట్ల ఏర్పాటు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గూడూర్‌లో ఉన్న కస్తూర్బా గిరిజన బాలికల వసతిగృహానికి ప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోలార్ లైట్లు బుధవారం ఏర్పాటు చేశారు. దీంతో శివకుమార్‌గౌడ్‌కు ప్రిన్సిపాల్ మంజుల, ఉపాధ్యాయ బృందం కృతజ్ఞతలు తెలిపారు.

కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి: జెడ్పీ చైర్‌పర్సన్

మనోహరాబాద్(తూప్రాన్): కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత అన్నారు. బుధవారం మండల కేంద్రం మనోహరాబాద్‌లో రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ భూపతిరెడ్డి, సర్పంచ్ మహిపాల్‌రెడ్డిలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో బీఆర్‌ఎస్‌కే ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు తెలుపుతున్నారన్నారు.

బాధ్యతతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్

అధికారులకు ఎంపీపీ శ్రీనివాస్ హితవు

పెద్దశంకరంపేట(మెదక్): అధికారులు బాధ్యతతో పనిచేయాలని ఎంపీపీ జంగం శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఎంపీపీ శ్రీనివాస్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల వారీగా గుర్తించిన సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులకు సహకరించాలని, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని, సమావేశాలకు అధికారులు తప్పకుండా హాజరుకావాలని తెలిపారు. ప్రభుత్వం తరఫున గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రైతులకు వాటిపై అవగాహన కల్పించి కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా, వైస్ ఎంపీపీ లక్ష్మి, రైతుబంధు అధ్యక్షుడు సురేశ్‌గౌడ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దత్తు, ఎంపీటీసీలు వీణసుభాశ్‌గౌడ్, స్వప్నరాజేశ్, మానస, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

వ్యాపార నిర్వహణకు రూ. 8లక్షల రుణం

చేగుంట(తూప్రాన్): మహిళా సంఘాల సభ్యులు వ్యాపారాలు నిర్వహిస్తే గరిష్ఠంగా రూ.8లక్షల వరకు రుణాలు అందిస్తున్నట్లు ఐకేపీ ఏపీఎం లక్ష్మీనర్సమ్మ అన్నారు. బుధవారం ఎంపీపీ శ్రీనివాస్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా సంఘాల ఆర్థిక ఎదుగుదల కోసం వ్యాపారాల నిర్వహణకు ప్రత్యేక రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. కోళ్ల పెంపకం కోసం సైతం రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు మహిళలు రుణాలను వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ అనీల్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆరోగ్యకేంద్రంలో మెరుగైన సేవలను అందిస్తున్నామని వాటిని వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆనందమేరీ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొనారు.

పోలింగ్ కేంద్రాలను సన్నద్ధం చేయండి



చిలప్‌చెడ్(నర్సాపూర్): ఓటర్ల వివరాలు పరిశీలిస్తున్న జగన్నాథం



కొల్చారం(నర్సాపూర్): వెంకటాపూర్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

- ఎలక్షన్ సెక్టోరియల్ అధికారి లునావత్ జగన్నాథం

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఎన్నికలు దగ్గర పడుతున్నాయని, అన్ని వసతులతో పోలింగ్ కేంద్రాలను సన్నద్ధం చేయాలని ఎలక్షన్ సెక్టోరియల్ అధికారి లునావత్ జగన్నాథం అన్నారు. బుధవారం మండలంలోని చిట్కుల్ గ్రామంలోని 73, 74, 75 పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల్లో తాగేందుకు నీళ్లు, ర్యాంపు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు ఉండాలన్నారు. అదేవిధంగా గ్రామంలోని ఓటర్ల సంఖ్య తదితర వివరాల గురించి అడిగి తెలుసుకున్నామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి తిరుపతి పాల్గొన్నారు.

కొల్చారం(నర్సాపూర్): మండలంలో కొనసాగుతున్న పల్లె ప్రకృతి వనాలు, గ్రామ నర్సరీలను, పోలింగ్‌కేంద్రాలను బుధవారం ఎంపీడీఓ గణేశ్‌రెడ్డి పరిశీలించారు. మండలంలోని కొంగోడ్, నాయిని జలాల్‌పూర్, అంసాన్‌పల్లి, పోతిరెడ్డిపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో సందర్శించారు. మొక్కలు పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని గ్రామ పంచాయతీ అధికారులకు సూచించారు. ఆయన వెంట ఏపీఓ మహిపాల్‌రెడ్డి, కార్యదర్శులు ఉన్నారు.

మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై కేసులు

- ప్రమాదాలపై అవగాహన
- ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి


అల్లాదుర్గం(మెదక్): మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, అలా కాదని వారికి వాహనాలిస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. మంగళవారం బస్సు, బైక్ ఢీకొనడంతో ఇద్దరు మైనర్లు మృతి చెందడం బాధకరమన్నారు. బైకులు నడిపేటప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడడం, మద్యం సేవించి వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. పోలీసులు ఎన్నిసార్లు చెప్పినా.. కొందరు పట్టించుకోవడం లేదని, ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పకుండా పెట్టుకోవాలని తెలిపారు. సకాలంలో తమ వాహనాలకు ఇన్సూరెన్స్ కట్టలేక పోతున్నారు. సకాలంలో కట్టుకుంటే ప్రమాదం సంభవించినప్పుడు వాహన ఇన్సురెన్స్ కంపెనీ నుంచి బీమా వాహనదారునికి వస్తుందన్నారు. మండలంలో కొందరు ద్విచక్ర వాహనదారులు నంబర్లు మార్చుకొని తిరుగుతున్నారని, అలాంటి వాహనాలను సీజ్ చేసి, ఆర్టీఏ అధికారులకు అప్పగిస్తామని చెప్పారు. చిన్నారులకు ద్విచక్ర వాహనాలు ఇవ్వకూడదని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సంక్షిప్త వార్తలు

◆ బీఆర్‌ఎస్‌లో చేరికలు

రామాయంపేట(మెదక్): బీజేపీ పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు మెట్టు స్వప్న బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈమేరకు ఆమె కొందరు మహిళలతో కలిసి బుధవారం పార్టీలో చేరగా, మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు యాదగిరి వారి మెడలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ బాదె చంద్రం, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ రోడ్డు ప్రమాదంలో మృతి



సురేశ్

రామాయంపేట(మెదక్): బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దంతేపల్లి పంచాయతీ పరిధిలోని బిల్యా తండాకు చెందిన రామావత్ సురేశ్ (26)కు భార్య సునీతతో పాటు చిన్న కూతురు ఉంది. ఇటీవల ఆ దంపతులు బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చారు. అక్కడ కూలీ పనులు చేసుకుంటూ తన భార్యాపిల్లలను పోషించుకుంటున్న సురేశ్‌ను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనగా అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ విషయమై తండాకు సమాచారం అందగా, తండా వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేదస్థితిలో ఉన్న మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని వారు విజ్ఞప్తిచేశారు.

◆ కాంగ్రెస్‌లో చేరికలు

మనోహరాబాద్(తూప్రాన్): బీఆర్‌ఎస్‌పై ప్రజలు విసుగు చెందారని, కాంగ్రెస్‌తో న్యాయం జరుగుతుందని ప్రజలు చెబుతున్నారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రామాయపల్లిలోని ప్రజలు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం గ్రామంలో ప్రచారం ఆయన నిర్వహించారు.

◆ 'ఆ తీర్మానంతో మాకు సంబంధం లేదు'

ములుగు(గజ్వేల్): తామంతా ఏకగ్రీవంగా సీఎం కేసీఆర్‌కు మద్దతు ప్రకటిస్తూ తీర్మానం చేశామనడం వాస్తవం కాదని కొండపోచమ్మసాగర్ భూ నిర్వాసిత గ్రామమైన మామిడ్యాల ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన పలువురు పేర్కొన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. తీర్మానం చేసిన వారు బీఆర్‌ఎస్ కార్యకర్తలు అయి ఉండొచ్చని పేర్కొన్నారు.

◆ లక్ష్మి సేవలు శ్లాఘనీయం



చిన్నశంకరంపేట(మెదక్): పీహెచ్‌సీ ఏఎన్‌ఎంగా పనిచేస్తూ అకాల మరణం చెందిన లక్ష్మి సేవలను మరిచిపోలేమని మెడికల్ ఆఫీసర్ సాయి సింధు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సంతాపసభలో ఏఎన్‌ఎం లక్ష్మి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె అందించిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ హెల్త్ ఆఫీసర్ యాదగిరి, రాజేశ్ పాల్గొన్నారు.

చేసిన అభివృద్ధి పనులే గెలిపిస్తాయి



నర్సాపూర్‌లో మేనిఫెస్టో పత్రాలు చూపిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్: సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే ఎన్నికల్లో తనను గెలిపిస్తాయని నర్సాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి అన్నారు. ఆమె ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం పట్టణంలోని పలు వార్డుల్లో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, పలువురు పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అభివృద్ధి పనులు చేశారని చెప్పారు. ఇతర పార్టీల కన్న బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో మెజార్టీతో గెలుస్తానన్న ధీమా సునీతారెడ్డి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అన్ని వర్గాలకు సంక్షేమాన్ని అదించారని, ఆయన చేసిన పనులే సునీతారెడ్డిని గెలిపిస్తాయని చెప్పారు. ప్రచారంలో పార్టీ నాయకులు నర్సింగ్‌రావు, నయిమోద్దీన్, అశోక్‌గౌడ్, లలిత, భిక్షపతి, జ్ఞానేశ్వర్, నాగరాజుగౌడ్, జగదీశ్వర్, నగేశ్, షేక్ హుస్సేన్, మహ్మద్, సాగర్, జమాల్, రాకేశ్‌గౌడ్, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రవణ్‌కుమార్, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు యువత తమ పార్టీ వైపు ఆకర్షితులవుతున్నారని అన్నారు. తాను ప్రచారానికి ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు.



పార్టీలో చేరుతున్న వారితో సునీతారెడ్డి



ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి

ముమ్మరంగా తనిఖీలు

గజ్వేల్‌రూరల్: ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున డబ్బులతో ప్రయాణించే వారు వాటికి సంబంధించిన ఆధారాలు వెంటబెట్టుకోవాలని గజ్వేల్ ఏసీపీ రమేష్ సూచించారు. బుధవారం గజ్వేల్ పట్టణ పరిసర ప్రాంతాల్లో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ పరిసరాల్లోని 9 ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా ఉన్న రూ. లక్షా 5వేలను సీజ్ చేశామని తెలిపారు. తనిఖీల్లో గజ్వేల్ సీఐ జానొరెడ్డి, ట్రాఫిక్ సీఐ తిరుపతి, పోలీసు అధికారులు, సిబ్బంది, కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ గ్రామంలో బుధవారం ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం ఆనంద్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు.

అందరూ ఓటుహక్కును వినియోగించుకోవాలి



మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న విద్యార్థులు

చిన్నశంకరంపేట(మెదక్): అందరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్య మనుగడకు ఓటుహక్కు ప్రాణ వాయువు లాంటిదని మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేందర్ పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నాగేందర్ ఎన్నికల ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు ఓటుహక్కును వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.

పోలింగ్ ప్రక్రియపై అవగాహన

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని కుకునూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం పోలింగ్ ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుడు నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ పోలింగ్‌లో నామినేషన్‌లు దాఖలు చేయడం, బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేయడం, ఓట్ల లెక్కింపు, ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాల జారీ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం హెచ్‌ఎం సీతారాం మాట్లాడుతూ.. ఓటింగ్ వయసు రాకముందే ఎన్నికల భావనను విద్యార్థులకు పరిచయం చేయడానికి మాక్ పోలింగ్ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే రూ. 2లక్షలు రుణమాఫీ

- రూ 4వేల పింఛన్, రూ. 500 గ్యాస్, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు
- కౌడిపల్లి ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి



కౌడిపల్లి(నర్సాపూర్): దేవులపల్లిలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు గిట్టుబాటు ధరతో పాటు ఏకకాలంలో రూ. 2లక్షలు రుణమాఫీ చేస్తానని నర్సాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నాగ్సాన్‌పల్లి, తిమ్మాపూర్, దేవులపల్లి, కౌడిపల్లి, లింగంపల్లి, కంచన్‌పల్లి, బూరుగడ్డ, సదాశివపల్లి, పాంపల్లి, ధర్మాసాగర్ గ్రామాల్లో రోడ్‌షో, ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలను మోసం చేసిన బీఆర్‌ఎస్‌ను తరిమికొట్టాలన్నారు. ఎమ్మెల్యే సొంత మండలంలో సైతం అభివృద్ధి జరగలేదని, డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వలేదన్నారు. దేవులపల్లి గ్రామంలో అధికార పార్టీ నాయకులు భూకబ్జాలు చేశారని, భూములు అమ్ముకునేందుకు వీలుగా రోడ్డు వేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఏకకాలంలో రుణమాఫి చేయడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫి చేయడంతో పాటు రైతులకు గిటుబాటు ధర కల్పిస్తామన్నారు. రైతు భరోసా ద్వారా రైతులతో పాటు కౌలు రైతులకు ఎకరాకు రూ. 15వేలు, వరి పంటకు రూ. 500 బోనస్ ఇస్తామన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళకు ప్రతీ నెల రూ. 2500 ఇవ్వడంతో పాటు ఆర్టీసీ బస్‌లో ఉచిత ప్రయాణం, రూ. 500 గ్యాస్ ఇస్తామన్నారు. గృహజ్యోతి ద్వారా ప్రతీ కుటుంబానికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్, వృద్ధులకు చేయుత ద్వారా రూ. 4 ఫించన్ ఆరు గ్యారంటీల్లో ప్రజలకు అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు సుహాసినిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, యూత్ అధ్యక్షుడు ధన్‌సింగ్, పాషా, శ్రీనివాస్‌గౌడ్, వీరేశ్‌గౌడ్, రాములు, పోచయ్య, గౌడి మల్లేశం, ప్రవీణ్‌రెడ్డి, సత్యాగౌడ్, కిషన్‌గౌడ్ పాల్గొన్నారు.

భూ అక్రమదారుల భరతం పడతాం

శివ్వంపేట(నర్సాపూర్): భూ అక్రమాలకు పాల్పడిన బీఆర్‌ఎస్ నాయకుల భరతం పట్టేందుకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని దొంతి గ్రామంలోని జీవన్‌దివ్య గార్డెన్‌లో మండల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుహాసినిరెడ్డి, ఆంజనేయులుగౌడ్, కర్ణాకర్‌రెడ్డి, నవీన్‌గుప్తా, లక్ష్మీకాంతం, శ్రీనివాస్‌గౌడ్, కమలపూల్‌సింగ్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, గణేశ్, రవిగౌడ్, మోహన్‌గౌడ్, హన్మంత్‌రెడ్డి ఉన్నారు.



వెల్దుర్తిలో కాంగ్రెస్‌లో చేరిన వారితో రాజిరెడ్డి

కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

మండలంలోని ఘనాపూర్ సహకార సంఘం చైర్మన్ లక్ష్మయ్య, దుర్గ భవాని సంఘం చైర్మన్ సిద్ది రాములు, గ్రామ పీఏసీఎస్ చైర్మన్ నాగులు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌కు చెందిన దాదాపు 150 మంది కాంగ్రెస్ లో చేరారు. వీరికి శైలజరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి మండలంలోని బండపోసాన్‌పల్లి, రామాయిపల్లి గ్రామానికి చెందిన సుమారు 80 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో విసుగుచెంది ప్రజలు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు రాజిరెడ్డి అన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



శివ్వంపేట(నర్సాపూర్): మాట్లాడుతున్న రాజిరెడ్డి

కాంగ్రెస్ గెలుపుతో పేదల జీవితాల్లో వెలుగు



వరిగుంతంలో ఎన్నికల ప్రచారంలో శైలజారెడ్డి

కొల్చారం(నర్సాపూర్): రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపుతోనే పేద, మధ్య తరగతి జీవితాల్లో వెలుగులు నిండుతాయని నర్సాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి సతీమణి శైలజారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రం కొల్చారం, వరిగుంతం, రాంపూర్, కిష్టాపూర్, చిన్న ఘనాపూర్ గ్రామాల్లో గడపగడపకు కాంగ్రెస్, ఇంటింటికి ఆరు గ్యారంటీ పథకాలపై తనయుడు రుత్విక్ రెడ్డితో పాటు శైలజరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ.. పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టే అభివృద్ధి పథకాలకు సంబంధించి కరపత్రాలను అందజేశారు. నర్సాపూర్ ఎమ్మెల్యేగా రాజిరెడ్డిని గెలిపిస్తే సేవ చేసేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్లేశంగౌడ్, వరిగుంతం సర్పంచ్ ఉమారాణి, ఉపాధ్యక్షులడు గోవర్దన్, అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి మహేశ్వర్‌రెడ్డి, మైనారిటీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ అక్రమ్, మండల కోశాధికారి మధుసూదన్‌రెడ్డి, కొల్చారం గ్రామాధ్యక్షుడు శ్రీశైలం, రాష్ట్ర ఓబీసీ సెల్ కార్యదర్శి మురళీధర్, మండల ప్రధాన కార్యదర్శి రవీందర్‌గౌడ్, నాయకులు ఆగంగౌడ్, విజయ్‌గౌడ్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.